సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 31 । ఆగస్టు । 2023



గల్ఫ్‌యానం.. గగనం!
తిరుపతి నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నది కలగానే మిగిలిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినా కేంద్రం కనికరించలేదు. -8లో..



చోరీ కేసులో ఇద్దరు అరెస్టు
పట్టు జరీ చోరీ కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 5.30 లక్షల విలువగల జరీ రీల్స్, కారు స్వాధీనం చేసుకున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.90	రూ.140



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 271 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	558	628
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 251.900 కిలోలు

న్యూస్‌రీల్

ప్రకృతిసేద్యం జిల్లా మేనేజర్‌గా రామకృష్ణరాజు



కడప అగ్రికల్చర్: అన్నమయ్య జిల్లా ప్రకృతి సేద్యం ఫుల్ అడిషినల్ చార్జి(ఎఫ్ఏసీ) డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం)గా రామకృష్ణరాజును నియమిస్తూ రైతు సాధికారిక సంస్థ సీఈఓ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన రేపో మాపో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా రెగ్యులర్ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కూడా ప్రకృతి సేద్య విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు.

పీకేఎం వీసీగా బాబర్



కదిరి: పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం) వైస్ చైర్మన్‌గా ఎం.బాబర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. బాబర్ ప్రస్తుతం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉంటూ ఈ మధ్యే అసిస్టెంట్ సెక్రెటరీగా పదోన్నతి పొందారు. చిత్తూరు జిల్లా సదుంకు చెందిన బాబర్... సెకండ్ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఓడి చెరువు మండలం వీరఓబునపల్లిలో చాలా కాలం టీచర్‌గా పని చేశారు. స్థానిక మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్‌ను వివాహం చేసుకొని కదిరిలోనే కాపురం ఉండేవారు. అనంతరం గ్రూప్–2కు ఎంపికై న బాబర్ ఆ తర్వాత కదిరి మున్సిపల్ కమిషనర్‌గా , ఆ తర్వాత జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేశారు. అనంతరం బదిలీపై ఏపీపీఎస్సీకి వెళ్లారు. ప్రస్తుతం పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ (పీకేఎం) అథారిటీ వైస్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు.

విద్యతోనే ఉజ్వల భవిత



మాట్లాడుతున్న మురళి

కురబలకోట: విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ (ట్రైనింగ్ సెంటర్స్)డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. నైపుణ్యం గల విద్యార్థులు దేశానికి వరమని అన్నారు. బుధవారం ఆయన అంగళ్లలో మూడు జిల్లాల హెడ్మాస్టర్లకు నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతో నైపుణ్యాలు కల్గిన విద్యార్థులను తయారు చేయాలన్నారు. దేశ భవిష్యత్తు రేపటి పౌరులదేనన్నారు. ఇంటిలో చెప్పని జీవిత నైపుణ్యాల గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. పుస్తకం కవర్‌ను బట్టి పుస్తకాన్ని విశ్లేషించలేమన్నారు. అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్నవి విద్యార్థుల అభ్యున్నతికి, ప్రగతికి దోహదపడాలన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ తెలిపారు. భారత వైమానిక దళం ఆధ్వర్యంలో సెప్టెంబరు 15న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నిరుద్యోగ యువతకు సికింద్రాబాదులోని బేగంపేట 12 ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్ ఎయిర్‌ఫోర్స్‌లో బహిరంగ నియామక ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత పాల్గొనాలని సూచించారు.

కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం



బద్వేలులో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్

బద్వేలు అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్ పేర్కొన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం బద్వేలు, కడప నగరంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హోదా అంశం మీదనే బీజేపీతో విభేదించాలని చెబుతున్న చంద్రబాబు నాలుగేళ్లలో హోదాపై నోరు మెదపలేదని మండిపడ్డారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతోందన్నారు.

సర్వేజన..స్వగృహ ప్రాప్తిరస్తు



నా పేరు షేక్ రియాజుర్ రెహమాన్. మేము రాయచోటిలో ఉంటాం. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మేము జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లో ఇటీవల ప్లాటు తీసుకున్నాను. రాయచోటి లోని దిగుఅబ్బవరం పరిధిలో వేసిన ఎమ్మార్జీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల లక్కీ డ్రాలో నాకు 236 నంబరు ప్లాటు లభించింది. ప్రశాంత వాతావరణంలో నివసించడానికి అనువైన వాతావరణం కల్పించినందుకు సంతోషంగా ఉంది. రాయచోటిలోని లేఔట్ లో అన్ని వసతులు కల్పిస్తున్నారు ప్రత్యేకంగా మధ్య తరగతి ప్రజలకు అందించాలన్న ఆలోచన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో ప్లాట్లు
- రాయచోటిలో 31 ఎకరాల్లో తొలి విడత ప్లాట్ల అందజేత
- మరో 20 ఎకరాల్లో రెండో విడతకు ప్రణాళిక



లే అవుట్ నుంచి రాయచోటి రింగ్‌రోడ్డుకు వేసిన డబుల్ రోడ్డు నిర్మాణం (ఇన్‌సెట్) లే అవుట్‌లో నిర్మాణంలో మంచినీటి ట్యాంకు

సాక్షి రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వస్తోంది. ఒకవైపు అభివృద్ధి , మరోవైపు సంక్షేమమే పరమావధిగా ముందుకు వెళుతున్న ప్రభుత్వం పేదలందరికీ పక్కా గృహాలు అందిస్తూ సొంతింటి కల నెరవేరుస్తోంది. అంతేకాకుండా పేదలకు ఇప్పటికే స్థలాలను కూడా అందించిన వైఎస్ జగన్ సర్కార్ ఇళ్ల నిర్మాణాలతో చురుగ్గా కదులుతోంది. అయితే మధ్యతరగతి ప్రజలకు సంబంధించి అందుబాటులో ఉండే ధరలతో ప్లాట్లు అందించాలని సంకల్పించింది. అందులో భాగంగా పట్టణాల్లోని ప్రజలకు మొదటగా ఇవ్వాలన్న ఆలోచనతో వడివడిగా అడుగులు పడుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో అర్హులైన మధ్యతరగతి ప్రజలందరికీ అందించేందుకు అవసరమైన లే అవుట్లతోపాటు ప్లాట్లను సిద్ధం చేశారు. ఇప్పటికే పలుచోట్ల దరఖాస్తులను కూడా స్వీకరించిన అధికారులు అందుకు అనుగుణంగా లే అవుట్లలో మౌలిక వసతుల కల్పనలో నిమగ్నమయ్యారు.

ఆరు నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక

అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మధ్యతరగతి ప్రజలకు సంబంధించి లే అవుట్లకు అవసరమైన స్థలాల ఎంపికను అధికారులు పూర్తి చేశారు. రాయచోటి దిగువ అబ్బవరం పరిధిలో 31.07 ఎకరాలు, రాజంపేట పరిధిలోని తాళ్లపాక పంచాయతీలో 9.92 ఎకరాలు, రైల్వేకోడూరు పరిధిలో 20 ఎకరాలు, పీలేరు పరిధిలో దొడ్డిపల్లి–వేపులబైలు వద్ద 30 ఎకరాలు, తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలంలోని ముదివీడు గ్రామం వద్ద 19.36 ఎకరాలు, మదనపల్లె పరిధిలోని పోతపోలు గ్రామం వద్ద 21.56 ఎకరాల స్థలాలను కేటాయించారు. పట్టణాల్లో నివసించే మధ్యతరగతి ప్రజలకు సంబంధించి అనుకూల వాతావరణంలో ఉండే స్థలాలను ఎంపిక చేసి లే అవుట్లకు సిద్ధం చేశారు.

మూడు కేటగిరీల్లో ప్లాట్లు

అన్నమయ్య జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో స్థలం ఎంపిక పూర్తి కావడంతో లే అవుట్లను సిద్ధం చేయడంతోపాటు ప్లాట్లను రెడీ చేశారు. ప్రధానంగా మూడు కేటగిరీల్లో 150, 200, 240 చదరపు అడుగులతో కూడిన ప్లాట్లు రెడీ చేశారు. ఇప్పటికే రైల్వేకోడూరులో దరఖాస్తులు స్వీకరించి లక్కీ డిప్ ద్వారా ప్లాట్లను కేటాయించే కార్యక్రమం పూర్తయింది. రాజంపేట, రైల్వేకోడూరులలో కూడా దరఖాస్తులు స్వీకరించిన అధికారులు త్వరలోనే లక్కీ డిప్ ద్వారా ప్లాట్లను అందించనున్నారు. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో ప్లాట్లకు దరఖాస్తులు స్వీకరించారు. అయితే ప్లాట్ల కేటాయింపు కార్యక్రమం కొనసాగాల్సి ఉంది.

జిల్లాలో ఎంఐజీ లే అవుట్ల స్థల వివరాలు

నియోజకవర్గం	కేటాయించిన భూమి (ఎకరాల్లో)	ప్లాట్లు
రాయచోటి	31.07	233
రాజంపేట	09.92	111
రైల్వేకోడూరు	20.00	234
పీలేరు	30.00	284
తంబళ్లపల్లె	19.36	-
మదనపల్లె	21.56	-

రాయచోటిలో అదనంగా మరో లే అవుట్

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఎంఐజీ లే అవుట్ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. దిగువ అబ్బవరం సమీపంలోని 30 ఎకరాల్లో తొలి విడత లే అవుట్ వేసి 233 మందికి అందించారు. ఇంకా ప్లాట్లకు డిమాండ్ ఉండడంతో వేగవంతంగా మరో 20 ఎకరాలు ప్రస్తుతం ఉన్న లే అవుట్ పక్కనే సేకరించారు. అందులోనూ ఎంఐజీ లే అవుట్‌లో సదుపాయాల కల్పన కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. ప్రధానంగా సిమెంటురోడ్ల నిర్మాణంతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయింది. లే అవుట్‌లో మిగిలిన ప్రభుత్వ స్థలాలకు సంబంధించి ప్రహారీలు, ఇతర కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నారు. మంచినీటి వసతికి సంబంధించి ట్యాంకు, ఎంఐజీ లే అవుట్ నుంచి నేరుగా రాయచోటి పట్టణంలోకి వచ్చేందుకు వీలుగా డబుల్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది.

మధ్యతరగతి ప్రజలకు వరం



రాయచోటితోపాటు మిగిలిన అన్నిచోట్ల మధ్యతరగతి ప్రజలకు ప్లాట్లు అందిస్తున్నాం. మూడు విభాగాల్లో అర్హులైన వారందరికీ అందేలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే స్థల ఎంపిక మొదలుకొని ప్లాట్లు కూడా వేశారు. ఎంఐజీ లే అవుట్లలో ప్లాట్లకు అన్నిచోట్ల మంచి డిమాండ్ ఉంది. అందుకు అనుగుణంగా ప్లాట్లు అందిస్తూ వస్తున్నాం. రాయచోటిలో తొలి విడత వేసిన లే అవుట్‌లో ప్లాట్లన్నీ పూర్తిగా లబ్ధిదారులకు కేటాయించాం. రెండో విడతకు సంబంధించి కూడా సమీపంలోనే మరో 20 ఎకరాలు కేటాయించాం. రాయచోటి లే అవుట్‌లో పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. – పీఎస్ గిరీషా, కలెక్టర్

వీఆర్‌వో సస్పెన్షన్

పీలేరురూరల్: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఎర్రగుంట్లపల్లె వీఆర్వో యోగనందకుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నాలుగు రోజుల క్రితం తిరుపతి జిల్లాకు బదిలీ అయిన ఆయనను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ గిరీషా ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వు కాపీలు తిరుపతి కలెక్టర్‌కు పంపించారు. వివరాలు.. మండలంలోని ఎర్రగుంట్లపల్లె పంచాయతీ సర్వే నంబరు 775లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా పరిరక్షించడంలో వీఆర్వో విఫలం అయినందున సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారీ జెర్రి



జెర్రిపోతు పామును చూపుతున్న రజాక్

అన్నమయ్య జిల్లా ములకలచెరువు వక్కలగుట్ట కాలనీలో భారీ జెర్రిపోతును చూసి అది ఏ పామో తెలియక ప్రజలు హడలిపోయారు. ఓ ఇంట్లో ఉన్న దానిని రజాక్ అనే వ్యక్తి బయటకు లాక్కొని వచ్చాడు. జెర్రిపోతు అని తెలుసుకుని స్థానికులు దానిని హతమార్చారు. –ములకలచెరువు

ఆహారానికి మించిన ఔషధం లేదు

ప్రకృతి వనం ప్రసాద్



గోల్డన్‌వ్యాలీలో మాట్లాడుతున్న ప్రకృతి వనం ప్రసాద్

కురబలకోట: ఆహారమే ఔషదం..వంటిల్లే వైద్యశాలగా మారినప్పుడు ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుంటుందని మనదపల్లె దగ్గరున్న ప్రకృతి వనం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అంగళ్లలో మూడు జిల్లాల యూపీ హైస్కూల్ హెడ్మాస్టర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడారు. నేడు ప్రతి ఒక్కరి జీవితం హడావుడిగా మారిందన్నారు. దీనికి తోడు ఒత్తిడితో కూడిన వ్యాపకాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. తద్వారా జబ్బులు వేధిస్తున్నాయన్నారు. ఆరోగ్యం బాగుండాలంటే ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలన్నారు. ఏది తినవచ్చు..ఏది తినకూడదన్న అవగాహన కలిగి ఉండటంతో పాటు ఆచరణలో పాటించాలన్నారు. ఏది పడితే అది తినడం వల్ల రోగాలబారిన పడుతున్నారన్నారు. రోగ నిరోధక శక్తి తగ్గకుండా చూసుకోవడం ద్వారా జబ్బులను నియంత్రించవచ్చన్నారు. శరీరం మనిషికి ప్రకృతి ఇచ్చిన గొప్ప బహుమతి అన్నారు. నీరు, వ్యాయామం, పౌష్టిక ఆహారం, తగినంత నిద్ర అవసరమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కూడా ఈ విషయాలను చెప్పి ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్యం బాగుంటే మానసికంగా బాగుంటారన్నారు. అప్పుడే చదువుల్లో రాణించడానికి కూడా ఆస్కారం ఉంటుందన్నారు. ఎంఈఓ ద్వారకనాథ్, ఎంఈఓ–2 శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మోదీని ఇంటికి పంపుదాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశంలోని ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని ఇంటికి సాగనంపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. కడప పాత కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని తెలిపారు. దేశాన్ని దివాళా తీసే విధంగా వ్యవహరిస్తున్న మోడీ గద్దె దింపేందుకు లౌకిక పార్టీలన్ని ఏకం కావాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీలపై దాడులు చేస్తూ పాలన చేస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో ముస్లింలు వెనుకబడి ఉన్నారని వారి సంక్షేమం కోసం పాలక ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర దర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితా సక్రమంగా నిర్వహించండి

డీఆర్‌ఓ సత్యనారాయణ



గాలివీడు: కుమ్మరపల్లెలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న సత్యనారాయణ

రామాపురం/ గాలివీడు: ఓటరు జాబితాను బీఎల్ఓలు సక్రమంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా డీఆర్ఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠ్రావుపేటలో బీఎల్ఓలు ఓటరు జాబితా సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎటువంటి చిన్న పొరపాటు కూడా ఉండకూడదని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించడం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలమన్నారు.

- ఆర్డీఓ రంగస్వామి మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ యువకులకు గుర్తించి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. కల్పనాయినిచెరువు , గోపగుడిపల్లె, గువ్వలచెరువులకు డ్రిప్ ఇరిగేషన్ కింద త్వరలో పనులు చేపడతామని ఆయన ప్రజలకు తెలిపారు. మండల తహసీల్దార్ అరవింద్ కిషోర్, వీఆర్ఓ నరసింహులు, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.
- గాలివీడు మండలంలోని గాలివీడు, గోరాన్‌చెరువు గ్రామ పంచాయితీలోని కుమ్మరపల్లెలో 175,179,184,202 పోలింగ్ కేంద్రాల ఓటరు జాబితాను డీఆర్ఓ పరిశీలించారు. ఆర్ఐ బాలాజీ, వీఆర్ఏలు, బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: 5–18 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న చిన్నారులను తప్పక బడిలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్)పై మండల స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ పరిధిలో జీఈఆర్ సర్వే నూరు శాతం పూర్తి చేయాలన్నారు. 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న చిన్నారులను బడిలో చేరేలా చూడాలని, ఇందు కోసం మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, కోట్లాది రూపాయలను ఖర్చు చేసిందని, ఇందులో భాగంగా పాఠశాలల్లో తొమ్మిది రకాల మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, షూస్, బ్యాగు, బెల్ట్ తదితర వాటిని అందజేసినట్లు చెప్పారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన లాంటి పథకాలు అమలు చేసి అన్ని రకాల వసతులను పాఠశాలల్లో కల్పిస్తోందన్నారు. ఎంఈఓలు పూర్తి స్థాయిలో వలంటీర్లను సమన్వయం చేసుకొని వంద శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ కృష్ణయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, మండల స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పునః పరిశీలన ప్రక్రియను పక్కాగా చేపట్టాలి

తొలగించిన ఓటర్లజాబితా పునఃపరిశీలన ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు. ఈ ఏడాది జనవరి 6వ తేదీ నుంచి ఆగస్టు 22 వరకు తొలగించిన ఓటర్ల జాబితా పునఃపరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ బుధవారం మధ్యాహ్నం వీరబల్లి, సుండుపల్లె మండలాల్లోని పలు గ్రామాల్లో వివిధ ఇళ్లను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెద్దివీడు గ్రామ పంచాయతీలో మరణించిన కారణంతో తొలగించిన వివిధ ఓటర్లను స్థానిక గ్రామస్తులతో వారు నిజంగా చనిపోయారా లేదా అని అడిగి నిర్ధారించుకున్నారు. ఓటును తొలగించే ధృవీకరణపత్రం మీద వివిధ పార్టీల బీఎల్ఏల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అనంతరం పెద్ద హరిజనవాడలోని గ్రామస్తులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్లపట్టాలు అందరికీ ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకొని లేని వారికి ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీరబల్లి మండల తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, సుండుపల్లి ఎంపీడీఓ రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- క్రీడా ప్రతిభా అవార్డులకు ఎంపిక
- మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఘనత



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల



రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్‌కు ఎంపికైన జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

మదనపల్లె సిటీ: పాఠశాల క్రీడా పోటీల్లో ప్రతిభ ఆధారంగా విద్యాశాఖ ప్రతి సంవత్సరం పురస్కారాలను అందజేస్తోంది. క్రీడల ప్రాముఖ్యతను గుర్తిస్తూ పతకాలు సాధిస్తున్న క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులకు ప్రోత్సాహం అందించడంలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆయా పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ ఏడాది జిల్లా స్థాయిలో రాణించిన 5 పాఠశాలలకు పురస్కారాలు అందజేశారు. అందులో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం దక్కించుకుంది.జిల్లా స్థాయిలో 133 పాయింట్లు సాధించింది.

స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డులకు ఎంపికైన పాఠశాలలు

పాఠశాల పేరు	పాయింట్లు	స్థానం
జెడ్పీహెచ్ఎస్ , మదనపల్లె	133	ప్రథమ
జెడ్పీహెచ్ఎస్, కొత్తమంచూరు	126	ద్వితీయ
ఏపి మోడల్ స్కూల్, సంబేపల్లి	86	తృతీయ
జెడ్పీహెచ్ఎస్, నాగవరం	75	నాలుగు
జెడ్పీహెచ్ఎస్ తరిగొండ	65	ఐదోస్థానం

ముందంజలో జెడ్పీ క్రీడాకారులు

ఎస్‌జీఎఫ్ పోటీల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి ప్రతిభ ఆధారంగా 133 పాయింట్లు కేటాయించి విద్యా అధికారులు ప్రథమ స్థానానికి ఎంపిక చేశారు. ప్రధానంగా పాఠశాల విద్యార్థులు రోప్‌స్కిప్పింగ్‌లో రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించి పతకాలు కైవసం చేసుకున్నారు. దీనికి 70 పాయింట్లు కేటాయించారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, కరాటే,అథ్లెటిక్స్ విభాగాల్లోనూ రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

పాఠశాలకు గుర్తింపు



స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు రావడంతో పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చింది. పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలవడానికి వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడల్లో మంచి తర్ఫీదు ఇస్తున్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

–సుబ్బారెడ్డి, హెచ్‌ఎం జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు



పాఠశాలలోల మెరికల్లాంటి క్రీడాకారులున్నారు. తగిన విధంగా శిక్షణ ఇస్తుండటంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏటా పతకాలు సాధిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం సంతోషంగా ఉంది.

–దేవకమ్మ, పీడీ, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లె : కడుపునొప్పితో బాధపడుతూ ముష్టూరు పంచాయతీ పొరాసువారిపల్లెకు చెందిన రమణ భార్య పి.ఈశ్వరమ్మ(45) బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఈశ్వరమ్మకు మరోసారి నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంటి వద్ద పురుగుమందు తాగారు. కుటుంబ సభ్యులు 108 మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : భూ వివాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన బుధవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. తలారివాండ్లపల్లెకు చెందిన రమణారెడ్డికి, మరో వర్గానికి చెందిన అన్నదమ్ములైన రంగారెడ్డి, ఆనందరెడ్డిలతో గత కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. ఇరువర్గాలు కోర్టుకు వెళ్లాయి. ఈ క్రమంలో రమణారెడ్డి కోర్టులో తనకు అనుకూలంగా తీర్పువచ్చిందంటూ నిర్మాణానికి అవసరమైన రాళ్లు వివాదస్పద స్థలంలో వేయించారు. మరో వర్గంలోని రంగారెడ్డి, ఆనందరెడ్డిలు ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఒకవర్గంలోని రమణారెడ్డి(60) తలకు గాయం కాగా, మరో వర్గంలోని రంగారెడ్డి (60), ఆనందరెడ్డి (55) గాయపడ్డారు. స్థానికులు బాధితులను 108 వాహనంలో వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పంచి ఇవ్వలేదని తల్లిపై దాడి


గాయపడిన తల్లి రాజమ్మ

మదనపల్లె : ఆస్తి పంచి ఇవ్వలేదని తల్లిపై కన్న కొడుకు దాడి చేసిన సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. సీటీఎం గ్రామానికి చెందిన వి.సత్యనారాయణ భార్య వి.రాజమ్మ(65)కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజమ్మకు వారసత్వంగా సంక్రమించిన 6.5 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆమె కుమారుడు బాలాజీ వ్యసనాలకు బానిసగా మారి.. కొంత కాలంగా ఆస్తి పంచి ఇవ్వాలంటూ తల్లిదండ్రులతో గొడవపడుతున్నారు. అనారోగ్యానికి గురై తండ్రి సత్యనారాయణ ఆరు నెలల కిందట మృతి చెందాడు. బుధవారం మద్యం మత్తులో మరోసారి ఆస్తి పంచాలంటూ తల్లి రాజమ్మతో గొడవపడ్డాడు. ఆవేశంతో కుర్చీతో ఆమె తలపై బాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పతికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గల్ఫ్‌యానం.. గగనం!

ప్రపంచ ప్రఖ్యాత అధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నది కలగానే మిగిలిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినా కేంద్ర ప్రభుత్వం కనికరించలేదు. దీంతో ఉభయ వైఎస్సార్ జిల్లా నుంచి ఎడారి దేశాలకు విమానాల్లో తిరగవచ్చుననే గల్ఫ్ వాసుల కల నెరవేరడంలేదు.

- గల్ఫ్ విమానాలు రన్‌వే పైకి చేరేదెప్పుడో?
- చెన్నై, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్ నుంచి ప్రయాణం
- తిరుపతి విమానాశ్రయానికి రప్పించేందుకు ప్రయత్నం

రాజంపేట : రాయలసీమలో ప్రధానంగా ఉభయ జిల్లాల నుంచి ఎడారి దేశాలకు వెళ్లే వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. రాజంపేట, రాయచోటి, కడప, బద్వేలు, రైల్వేకోడూరుతోపాటు ఉభయ జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి 2 లక్షల మందికి పైగా ఎడారి దేశాలపై ఆధారపడి జీవిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా కువైట్, ఖతార్, దుబాయ్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, అబుదాబీ, లెబనాన్, మస్కట్ దేశాలకు ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. మరింతమంది ఉద్యోగం, విద్య రీత్యా అమెరికా, కెనడా, సౌత్ ఆఫ్రికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇతర దేశాలకు వెళ్తున్నారు. వీరు విదేశీయానం చేయాల్సి వస్తే భాష రాని వివిధ రాష్ట్రాలలోని విమానాశ్రయాల వద్ద ఇబ్బంది పడుతున్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారిలో 60 శాతం మంది చదువు రాని వారు ఉండడంతో మోసాల పాలై జైళ్లలో మగ్గుతున్నారు.

గల్ఫ్ దేశాలకు విమానాలు ఎప్పుడో?

గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు నాలుగు దశాబ్దాల కిందట వారాలకొద్దీ సముద్రయానం చేసి ఎడారి దేశాలకు చేరుకునేవారు. గల్ఫ్ దేశాలలో పనిచేస్తే ఖరీదైన జీవితం సాగించవచ్చునని, తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావచ్చునని తెలియడంతో అనంతరం ప్రయాణం చేసే వారి సంఖ్య పెరిగింది. వీరంతా విమానాలపై ఆధారపడుతున్నారు. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఏడీసీఎల్(ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) అంతర్జాతీయ సర్వీసులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తిరుపతి, రాజంపేట లోక్‌సభ సభ్యులు తమ వంతుగా విమానాలను రన్‌వే మీదకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరుపతి నుంచి విదేశీయానంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కనికరించడం లేదు.



తిరుపతి ఎయిర్‌పోర్టు

వ్యయప్రయాసలతో ప్రయాణం

చెన్నై, కర్ణాటక, ముంబయి, హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు వెళ్లే వారు వ్యయ ప్రయాసలతో దూర ప్రాంతాల నుంచి వెళ్లాల్సి వస్తోంది. అనేక మంది బాష రాక ఇబ్బందిపడుతున్నారు. కొందరైతే మోసపోతున్నారు. దూర ప్రయాణంతో అనేక అవాంతరాలు ఎదురై ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేగాక విమాన టికెట్‌తోపాటు ఎయిర్‌పోర్టుకు చేరుకునే ఖర్చులు భరించాలంటే కష్టపడుతున్నారు. 2015లో తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించారు. కానీ ఆ స్థాయిలో కేంద్రప్రభుత్వం విమానాలను తీసుకురాలేదనే అపవాదు ఉంది.

విదేశీ విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలి



రాయలసీమ జిల్లా వాసులకు అందుబాటులో ఉండే తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి విదేశీ విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలి. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయాలి. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఎంపీలు తమ వంతు కృషి చేస్తున్నారు. ఉభయ జిల్లాల నుంచి విదేశాలకు వెళ్లాలంటే ఇతర రాష్ట్రాల వైపు చూడాల్సి వస్తోంది. త్వరలో విదేశీయానం సులభతరం చేసే బాధ్యత కేంద్రంపై ఉంది.

– చొప్పా అభిషేక్‌రెడ్డి, ఈడీ, ఏఐటీఎస్, రాజంపేట

గల్ఫ్ విమాన సర్వీసులు తీసుకురావాలి



తిరుపతి నుంచే గల్ఫ్ విమానాల సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. నిత్యం వందలాది మంది ఇతర రాష్ట్రాలలోని ఎయిర్‌పోర్టుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి విదేశీ విమానసర్వీసులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.

– గోవిందనాగరాజు, గల్ఫ్‌కో-కన్వీనర్, రాజంపేట

దళితులు, ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర

రాజంపేట : నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ముస్లిం, దళితుల ఓట్లు తొలగించేందుకు పచ్చ నేతలు కుట్ర పన్నుతున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆరోపించారు. ఆర్డీవో రామకృష్ణారెడ్డిని నందలూరు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం కలిసిన ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, సిద్దవటం, ఒంటిమిట్ట ప్రాంతాల్లో ముస్లింలు, దళితులు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారన్నారు. పచ్చ నేతలు గుర్తించి వారి ఓట్లను తొలగించాలని మండల రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న.. వారి ఆధార్ సంఖ్యలను అనుసంధానం చేసి ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఓట్లు తొలగించాలనే పచ్చ నేతల కుట్రలను తిప్పికొడతామన్నారు.ఆయనతో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఆర్డీవో రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్

ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి





ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. 42ఏళ్ల కలిగిన ఓ వ్యక్తి ఈ నెల 24న అనారోగ్యంతో ఆస్పత్రిలోని జీఈ వార్డులో చేరాడు. ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం మృతి చెందాడు. మాట్లాడలేని స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియలేదు. 60 ఏళ్ల వయసు కలిగిన మరో గుర్తు తెలియని వృద్ధుడు తీవ్ర అనారోగ్యంపాలై ఈ నెల 22న జిల్లా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న అతను మృతి చెందాడు. ఇరువురి మృతదేహాలను ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. బంధువులు, కుటుంబసభ్యులు ఆస్పత్రిలోని ఔట్‌పోస్టులో సంప్రదించాలని అధికారులు కోరారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని జె.కొత్తపల్లె గ్రామానికి చెందిన వివాహిత తంగెళ్ల బీనా(29) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. జె.కొత్తపల్లె గ్రామానికి చెందిన తంగెళ్ల బీనాకు చాపాడు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన వ్యక్తితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె ఉన్నారు. మూడేళ్ల కిందట భర్త చనిపోవడంతో తంగెళ్ల బీనా తల్లితండ్రుల వద్దే ఉంటోంది. చిన్నప్పటి నుంచి కడుపునొప్పి తాళలేక మానసికంగా కుంగిపోయారు. బుధవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి తండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

రైలు కింద పడి..

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని కడప రైల్వే ఎస్ఐ కేఎస్.వర్మ బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలుంటాయని, టీషర్ట్, నల్లటి లోయర్ ధరించాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, ఎవరైనా గుర్తు పడితే 9440900811 చరవాణి సంఖ్యకు వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

పట్టు జరీ చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

- కారుతో సహా రూ.5.30 లక్షల సొత్తు స్వాధీనం
- 48 గంటల్లోనే కేసు చేధించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కేశప్ప


కారుతో సహా నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐలు

మదనపల్లె : పట్టు జరీ చోరీ జరిగిన 48 గంటల్లో పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకుని కేసును ఛేదించారు. వారి నుంచి దాదాపు రూ. 5.30 లక్షల విలువగల 478 పట్టు జరీ రీల్స్, ఎతియోస్ కారు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ కేశప్ప స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎస్టేట్‌లోని వీఆర్‌ఎల్ లాజిస్టిక్స్ పార్శిల్ సర్వీసులో రూ.5.30 లక్షల విలువైన పట్టు జరీ చోరీకి గురైనట్లు గుర్తించిన సంస్థ మేనేజర్ హరిచరణ్ ఈ నెల 27న టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ ఇన్‌చార్జ్ సీఐ మహబూబ్‌బాషా సిబ్బందితో కలిసి 48 గంటల్లో ఛేదించారు.

పట్టు జరీ రీల్స్ విక్రయిస్తుండగా..

సత్యసాయిజిల్లా నల్లమాడ మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన గొడితిపల్లి వెంకట రమణప్ప(26), పట్టణంలోని వీఆర్‌ఎల్ లాజిస్టిక్స్ పార్శిల్ సర్వీస్‌లో హమాలీ, డ్రైవర్‌గా పనిచేస్తూ పట్టణంలోని పల్లెక్రాస్ బాలప్పగారి వీధిలో నివాసముంటున్నారు. నిమ్మనపల్లె మండలం వీరంరెడ్డిగారిపల్లెకు చెందిన శిబ్బాల సత్యనారాయణ(28) ప్రస్తుతం రాజానగర్‌లో కాపురం ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి జూలై 31న వీఆర్‌ఎల్ పార్శిల్ సర్వీసు ఆఫీసు మెయిన్ గేట్ లాక్ కోసి గోదాములో చొరబడ్డారు. గుజరాత్ నుంచి వచ్చిన 478 పట్టు జరీ రీల్స్‌ను అపహరించుకుని టయోటా ఎతియోస్‌లో పరారయ్యారు. అనంతరం చోరీ చేసిన రీల్స్‌ను బుధవారం అదే కారు డిక్కీలో ఉంచుకుని పట్టణంలోని కదిరిరోడ్డు టిప్పుసుల్తాన్ గ్రౌండ్ వద్ద విక్రయిస్తుండగా టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కేసును 48 గంటల్లోనే చేధించిన సీఐ మహబూబ్‌బాషాకు రివార్డు అందించేందుకు సిఫార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, ఎస్.ఐ హేమాద్రి పాల్గొన్నారు.

4.5 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐలు

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మదనపల్లె డివిజన్‌లో గంజాయి వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ నెల 29వ తేదీన సీటీఎం రైల్వేస్టేషన్ వద్ద గంజాయి విక్రయాలపై దాడి చేయగా నలుగురు యువకులు అనుమానస్పదంగా కనిపించారన్నారు. అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా సీటీఎం గ్రామానికి చెందిన ఉమాశంకర్(21), ఉదయకిరణ్(21), హరినాథ్ (21) పట్టుబడగా ప్రకాష్ పరారయ్యారని తెలిపారు. వారి వద్ద రూ.30 వేల విలువగల 4.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్టు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. నిందితులు గంజాయి వినియోగానికి అలవాటు పడి, తక్కువ ధరకు గంజాయిని ఏజెన్సీ ప్రాంతాలైన నర్సీపట్నం నుంచి కొనుగోలు చేసి సీటీఎం గ్రామానికి తెస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారులు తనిఖీలు


ఐరన్ ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రాజంపేట రూరల్ : రాజంపేట బైపాస్‌లోని వెంకటేశ్వర బాలమ్మ ట్రేడర్స్, శ్రీ సెవన్‌హిల్స్ ట్రేడర్స్‌లో విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. కార్మికుల హాజరు పట్టీ, ఇతర వివరాలు ఆరా తీసి నిర్వహణా లోపాలు గుర్తించారు. సీఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ తనిఖీలలో గుర్తించిన లోటుపాట్లను జిల్లా విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారికి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఇ.బాలగంగాధరరెడ్డి, ఏఈఈ వి.అశోక్‌కుమార్, జిల్లా సీటీఓ అధికారి ఎస్.కవిత, రాయచోటి లీగల్ మెట్రాలజీ అధికారి ఎస్.నాగరాజు, విజిలెన్స్ అధికారులు ఎస్.జనార్దనరావు, పి.సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ఎదురుఎదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పట్టణంలోని శేషప్పతోటకు చెందిన గంగిరెడ్డి(40) వ్యక్తిగత పనులపై పుంగనూరు రోడ్డులోని గంగమ్మగుడి నుంచి ద్విచక్రవాహనంలో మదనపల్లె పట్టణంలోకి వస్తుండగా, మదనపల్లె పట్టణం నుంచి పుంగనూరు వైపు బుల్లెట్ వాహనంలో వెళుతున్న మరో వ్యక్తి డ్రైవర్స్ కాలనీ మలుపు వద్ద గంగిరెడ్డి వాహనాన్ని ఢీకొన్నాడు .ప్రమాదంలో గంగిరెడ్డి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజంపేట మండలం తుమ్మల అగ్రహారం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ పెంచలయ్య కడపకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. జేఎంజే కళాశాల సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడడతో తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు 108 సాయంతో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

వెంకటాయపల్లెలో విష జ్వరాలు

సిద్దవటం: మండలంలోని వెంకటాయపల్లె గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జనం జ్వరంతో వణికిపోతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, రాజీ, వెంకటసుబ్బమ్మ, రమణ, ప్రణవిలు జ్వరంతో మంచంపట్టారు. మరింత మంది కడప ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించినట్లు స్థానికులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం గ్రామానికి వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించారు. నివేదిక వచ్చిన అనంతరం అందరికీ పరీక్షలు నిర్వహిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

చెరువులో పడి యువకుడు మృతి


మృతి చెందిన రాజేష్

మదనపల్లె : చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. రామసముద్రానికి చెందిన రాజేష్ (27), మదనపల్లెకు వస్తూ మార్గమధ్యంలోని బొమ్మనచెరువు గ్రామం సమీపంలోని చెరువులో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని మదనపల్లి తాలూకా పోలీసులకు అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మానపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చెరువు గట్టున బట్టలు వస్తువులు ఉండటంతో, యువకుడు ఈత కొట్టేందుకు గానీ, లేదా చేపలు పట్టేందుకని చెరువులోకి వెళ్లి ఉంటాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. చెరువులో ఉపాధి హామీ గుంతలు గతంలో తవ్వి ఉండడం వల్ల లోతు ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రమాదవశాత్తు ఉపాధి హామీ గుంతల వైపు వెళ్లి మునిగి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. యువకుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపహరణ కేసులో నిందితుల అరెస్టు


పట్టుబడిన నిందితులు

మదనపల్లె : మైనర్ బాలిక అపహరణ కేసులో ఇద్దరు నిందితులను పశ్చిమ బెంగాల్ పోలీసులు బుధవారం కురబలకోట మండలం అంగళ్లులో అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంగోర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్ బాలికలు ఆగస్టు 15న కిడ్నాప్ అయ్యారు. ఆగస్టు 24న సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇద్దరు బాలికలను అదే ప్రాంతానికి చెందిన ఫరజ్ లస్గర్(22), అతడికి సాయంగా నాసిర్ ఉద్దీన్(20) అపహరించి ఫరజ్ లస్గర్ అక్క ఇంట్లో ఉంచారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు మదనపల్లె పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు పశ్చిమ బెంగాల్ పోలీసులు గుర్తించారు. బంగోర్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ మురారి మోహన్ పాల్, హెడ్ కానిస్టేబుల్ ప్రభావతి, మహిళా కానిస్టేబుల్ సునితాదాస్‌లతో వచ్చి బుధవారం అంగళ్లులో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీసుల సాయంతో రిమాండ్ నిమిత్తం పశ్చిమ బెంగాల్‌కు తరలించారు.

అభివృద్ధి పథంలో సహకార బ్యాంకులు


లక్ష్మీదేవికి చెక్కు, ఉద్యోగ ఉత్తర్వులను అందజేస్తున్న డీసీసీబి చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో జిల్లాలోని 13 సహకార బ్యాంకులు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. సిద్దవటం ప్రాథమిక సహకార పరపతి సంఘంలో పనిచేస్తూ రామ్మోహన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన సతీమణి లక్ష్మీదేవికి రూ.4,24,057ల చెక్కు, ఉద్యోగ ఉత్తర్వులను బుధవారం ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో 30 సంవత్సరాల తరువాత బ్యాంకులు, సొసైటీలు లాభాల బాటలో పయనిస్తున్నాయన్నారు. రైతులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. రైతులు చెల్లించే పైకానికి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కె.రాజేంద్రకుమార్, డీసీసీ బ్యాంకు మేనేజర్ సుచిత్ర, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ ఖాజీపీరాన్, సొసైటీ ఉద్యోగి షుకూర్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, బాలిరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌బీఓ సస్పెన్షన్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఫారెస్ట్ బీట్‌లో పని చేస్తున్న ఎఫ్‌బీఓను అధికారులు సస్పెండ్ చేశారు. తన బీట్ పరిధిలోని బృందావనం కాలనీ సమీపంలో అటవీ శాఖకు సంబంధించిన ప్రహరీపై ప్రైవేట్ వ్యక్తులు గోడ నిర్మించిన వ్యవహారంలో ఉన్నతాధికారులు వేటు వేసినట్లు తెలుస్తోంది.